

రంజాన్ వేళలు
ఇఫ్తార్-బుధవారం
సాయంత్రం - 6.30
సహర్- గురువారం
ఉదయం - 5.09

ఇంటర్మీడియట్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. నేడు(బుధవారం) మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానుండగా, సెకండియర్ రేపటి నుంచి జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 16,439 మంది, మేడ్చల్ జిల్లాలో 1,26,423 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున నియమించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 9.05 గంటల వరకు అనుమతించనున్నారు.



నో యువర్ ఎగ్జామ్ సెంటర్

విద్యార్థులు పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందనేది సులువుగా తెలుసుకునేందుకు ఇంటర్మీయట్ విద్యా మండలి హాల్ టికెట్లపైన క్యూఆర్ కోడ్‌ను ముద్రించింది. ఈ కోడ్‌ను స్కాన్ చేయగానే పరీక్షా కేంద్రం అడ్రస్ తెలియనుంది. అలాగే ఎగ్జామ్ సెంటర్ లోకేటర్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి 'ఐపీఈ ఎగ్జామ్ సెంటర్ లోకేటర్ యాప్'ను డౌన్‌లోడ్ చేసుకుని 'నో యువర్ ఎగ్జామ్ సెంటర్ ఆప్షన్‌లో కాలేజ్ కోడ్, విద్యార్థి వివరాలు టైప్ చేస్తే పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందనేది తెలియనుంది.

విజయోస్తు..!

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- 20 మందికో ఇన్విజిలేటర్ నియామకం
- వికారాబాద్ జిల్లాలో 29, మేడ్చల్‌లో 150 పరీక్ష కేంద్రాలు
- సీసీ కెమెరాల నిఘా నీడలో ఎగ్జామ్స్
- ఉదయం 9.05 గంటల వరకు కేంద్రాల్లోకి అనుమతి
- సెంటర్ తెలుసుకునేలా హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్

వికారాబాద్ జిల్లా విద్యార్థుల వివరాలు

సంవత్సరం	జనరల్	ఒకేషనల్	మొత్తం
మొదటి	6,418	1,496	7,914
రెండో	5,589	1,374	6,963
ప్రైవేట్	1,562	-	1,562
మొత్తం	13,569	2,870	16,439

మేడ్చల్ జిల్లా విద్యార్థులు

సంవత్సరం	జనరల్	ఒకేషనల్	మొత్తం
మొదటి	62,829	1,278	64,107
రెండో	61,286	1,030	62,316
మొత్తం	1,24,115	2,308	1,26,423



వికారాబాద్/మేడ్చల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎండలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో ఎక్జామ్ సెంటర్ల వద్ద తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల్లో ఎవరైనా అస్వస్థతకు గురైతే సత్వరమే స్పందించి వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లను నియమించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. పరీక్ష కొనసాగే సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రతలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 200 మీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు అమలయ్యేలా చర్యలు చేపట్టారు. పరీక్షలు జరిగే సమయంలో జిరాక్స్ దుకాణాలు, కంప్యూటర్ సెంటర్లు మూసి ఉంచాలంటూ అధికారులు

మిగతా 8వ పేజీలో...



నవాబ్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

8.45 గంటల్లోగా కేంద్రాలకు చేరుకోవాలి



విద్యార్థులు ముందుగానే తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. ఆలస్యంగా వచ్చి ఒత్తిడికి గురి కావొద్దు. ఉదయం 8.45 గంటల్లోగా కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థులను 9.05 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఆ తర్వాత అనుమతించం. కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలి.

- శంకర్‌నాయక్, ఇంటర్ జిల్లా నోడల్ అధికారి



హాల్‌టికెట్ తీసుకుంటున్న విద్యార్థులు, పక్కన డొనేషన్ బాక్స్

రూ.300 ఇస్తేనే హాల్‌టికెట్

మర్పల్లి మోడల్ స్కూల్‌లో ఇష్టారాజ్యం

- డబ్బులిచ్చి హాల్‌టికెట్ తీసుకున్న విద్యార్థులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

మర్పల్లి, మార్చి4(ఆంధ్రజ్యోతి): రూ.300 ఇస్తేతప్ప హాల్‌టికెట్ ఇవ్వమని మోడల్ స్కూల్‌లో నిబంధన పెట్టడంతో ఇంటర్ విద్యార్థులు రూ.300 ఇచ్చి హాల్‌టికెట్లు తీసున్నారు. బుధవారం నుంచి ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానుండటంతో వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరం విద్యార్థులు 63 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 66 మంది, కాంపార్ట్‌మెంటల్ విద్యార్థులు 59 మంది మొత్తం 188 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇదే అదునుగా భావించిన పాఠశాల యాజమాన్యం వినూత్న రీతిలో డబ్బు వసూలుకు తెరలేపారు. ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా డొనేషన్ బాక్సులో రూ.300 వేస్తే తప్ప హాల్‌టికెట్ ఇవ్వమని నిబంధన పెట్టడంతో విద్యార్థులు చేసేది లేక డబ్బులిచ్చి హాల్‌టికెట్లు తీసుకున్నారు.

ఆట స్థలం అభివృద్ధికంటూ..

వార్షిక పరీక్షలు కావడంతో హాల్ టికెట్ రాకపోతే పరీక్ష రాసే పరిస్థితి ఉండదని విద్యార్థులు రూ.300 డొనేషన్ బాక్సులో వేసి హాల్‌టికెట్ తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి డొనేషన్ వసూలు చేయాలనే నిబంధన లేకపోయినా ఈ పాఠశాలలో కొత్త నిబంధనలతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపణలు వెలువడుతున్నాయి. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా డొనేషన్ పేరుతో డబ్బులు వసూలు చేయడం ఏంటని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ ప్రమీలను వివరణ కోరగా కళాశాల ఏ విద్యార్థిని ఇబ్బందులకు గురిచేయడం లేదని, ప్లే గ్రౌండ్ అభివృద్ధికి డొనేషన్ వసూలు చేస్తున్నామని, ఎవరికైనా ఫిర్యాదు చేసుకోవచ్చునని దురుసుగా సమాధానం ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ప్రశ్నిస్తే కళాశాలలో సమస్యలు ఉన్నాయని, అన్నింటికి ప్రభుత్వం నిధులు ఇస్తుందా? అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఎల్ఆర్ఎస్ సులభతరానికి నూతన నిర్ణయాలు

- గడువులోపు క్రమబద్ధీకరణకు 25శాతం ఫీజు మినహాయింపు
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకున్నదని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుము చెల్లించి, క్రమబద్ధీకరణ చేసుకోవచ్చన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపీవోలు, పంచాయతీ సెక్రటరీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 31 వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుములో 25 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. ఆగస్టు 26, 2020 వరకు 10 శాతం ప్లాట్లు విక్రయించిన లే-అవుట్‌లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సబ్ రిజిస్టర్ ద్వారా నిర్ణిత నమూనాలో సేకరించిన దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి, క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. బల్దియా, కలెక్టరేట్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. క్రమబద్ధీకరించని భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి ఉండదన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, జాకీర్ అహమ్మద్, బలరాం నాయక్, వెంకటయ్య, విక్రమసింహారెడ్డి, మునిసిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు ఉన్నారు.

రేపు జాబ్‌మేళా

వికారాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్బాస్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఐటీఐ క్యాంపస్, వికారాబాద్‌లో మార్చి 6న ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్‌కె ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సుమారు 200 అసెంబ్లింగ్ అసిస్టెంట్, ఆపరేటర్స్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. పదో తరగతి అంతకంటే ఎక్కువ విద్యా అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు నిర్వాహకుడు మియాసాబ్‌ను (9676047444) సంప్రదించవచ్చని తెలిపారు.

నల్లా బిల్లులు చెల్లించం

- కలెక్టరేట్ వద్ద కొత్రేపల్లివాసుల ఆందోళన
- అదనపు కలెక్టర్‌కు వినతి



అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

వికారాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా వసూలు చేయకుండా ఇప్పుడు వేలాది రూపాయల బిల్లులు చెల్లించమంటే.. చెల్లించేది లేదని వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని కొత్రేపల్లి గ్రామ మహిళలు పేర్కొన్నారు. ఈ మేరకు పెద్ద సంఖ్యలో మహిళలు మంగళవారం కలెకరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వీరికి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వికారాబాద్ మున్సిపాలిటీలో కొన్నేళ్లుగా నల్లా బిల్లులు తీసుకోలేదని ఇప్పుడు వేలాది రూపాయల బిల్లులు చెల్లించాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో బిల్లులు చెల్లించేది లేదని వాటిని మాఫీ చేయాలని, ఇప్పటి నుంచి నెల వారీ బిల్లులు వసూలు చేస్తే కట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టం చేశారు.



బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.92.49 లక్షలు 7
కీసరగుట్ట ఆలయంలో లెక్కింపు
నగదును బ్యాంక్‌లో జమ చేసిన ఆలయ నిర్వాహకులు

ఎల్ఆర్ఎస్‌పై విస్తృత ప్రచారం 8
తాండూరు మున్సిపాలిటీలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

ఎల్లమ్మ ఆలయంలో భక్తుల సందడి



దుద్యాల మండలం పోలెపల్లి రేణుక ఎల్లమ్మ ఆలయం మంగళవారం భక్తులతో పోటెత్తింది. గత వారం రోజులుగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. అమ్మవారి దర్శనానికి భారీగా క్యూ నెలకొంది. దీంతో దర్శనానికి గంటల కొద్దీ సమయం పడుతోంది. దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారి దర్శనానికి భక్తుల క్యూ..

-దుద్యాల, మార్చి4(ఆంధ్రజ్యోతి)



భయం గుప్పిట్లో మేడ్చల్!

పెరుగుతున్న నేరాలు, ఘోరాలు

- వరుస హత్యలతో భయాందోళనలో ప్రజలు.. స్థానికేతరుల వల్లే అఘాయిత్యాలంటున్న స్థానికులు
- పోలీసులకు కంటిమీద కునుకు కరువు.. రూరల్ పీఎస్ ఏర్పాటుకు అధికారుల ప్రతిపాదన!

మేడ్చల్‌టౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): దినదినాభివృద్ధి చెందుతున్న మేడ్చల్ ప్రాంతం హత్యలు, అత్యాచారాలు, లూటీలతో పాటు అసాంఘీక కార్యకలాపాలతో ఆందోళనకరంగా మారింది. ఒక వైపు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు తమ వంతు కృషి చేస్తున్నా ఇక్కడ పెరుగుతన్న క్రైమ్స్ పోలీసుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొద్ది రోజులుగా మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న వరుస హత్యలు ఇందుకు నిదర్శనంగా మారాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో అంతే వేగంగా నేరాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం లక్ష జనాభా దాటిన మేడ్చల్ ప్రాంతంలో

మిగతా 8వ పేజీలో...



బంగారం దుకాణంలో లూటీ చేసి పారిపోతున్న దుండగులు (ఫైల్)

ఇటీవల జరిగిన నేర ఘటనలు

- పోలీస్టేషన్‌కు కూతవేటు దూరంలోని బంగారు ఆభరణాల దుకాణంలో పట్టపగలే దోపిడీ జరిగింది.
- రెండు నెలల క్రితం లేబర్ అడ్డాపై ఓ కూలీ దారుణ హత్యకు గురయ్యాడు.
- జనవరి 24న ఓఆర్ఆర్ పక్కన ఓ మహిళను దారుణంగా హతమార్చి మృతదేహాన్ని కాలబెట్టారు.
- ఫిబ్రవరి 8న పట్టణంలో ఇటుక, సిమెంట్ కార్ఖానాలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు.
- ఫిబ్రవరి 10న వివాహేతర సంబంధం కారణంగా ఓ మహిళ ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హతమార్చింది.
- ఫిబ్రవరి 16న ఓ యువకుడిని నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే అతని సోదరుడు హత్య చేశారు.
- ఫిబ్రవరి 17న ఓ మైనర్ బాలుడు తన మేనబావను కిరాతకంగా హత్య చేశాడు. ఇలా వరుస హత్యలతో మేడ్చల్ ప్రాంతం అట్టుడికిపోతోంది. ఇప్పటి వరకు జరిగిన హత్యలకు సంబంధించిన నిందితులను పోలీసులు తక్కువ సమయంలో అరెస్టు చేసి కేసుల మిస్టరీని ఛేదించి ప్రశంసలు పొందుతునప్పటికీ నేర నియంత్రణకు ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. కాగా, ఈ హత్యలకు గురైన వారంతా స్థానికేతరులు కావడం గమనార్హం.

జాబ్‌మేళాకు భారీ స్పందన

కీసర రూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపల్ పరిధిలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. ఐఫోన్ ఫ్యాక్స్ కంపెనీ అధ్వర్యంలో మున్సిపల్ పరిధి మహిళలకు జాబ్ మేళా నిర్వహించారు. 10వ తరగతి, బీటెక్, ఎమ్మెస్సీ, ఎంబీఏ, టెక్నీషియన్స్, పాలిటెక్నిక్ డిప్లమా చేసిన 500మంది మహిళలు మేళాలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా కుటుంబ ఆర్థికాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలన్నారు. జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.450మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మాజీ కౌన్సిలర్లు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పుష్కరిణిలో జారిపడి వ్యక్తి దుర్మరణం



మృతదేహాన్ని వెలికి తీస్తున్న సిబ్బంది

చేవెళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్నానానికి వెళ్లిన వ్యక్తి కాలు జారి పుష్కరిణిలో పడి మృతిచెందిన ఘటన మంగళవారం చేవెళ్లలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలం గోనూర్ గ్రామానికి చెందిన బుచ్చప్ప (45) బతుకుదెరువు కోసం చేవెళ్ల మండలం కిష్టాపూర్‌లోని అత్తగారింట్లో ఉంటూ కూలి పనిచేసుకుంటున్నాడు. చేవెళ్లలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి పుష్కరిణిలో బుచ్చప్ప స్నానానికి వెళ్లగా కాలుజారి పడిపోయాడు. అతడికి ఈత రాక మునిగిపోయాడు. స్థానికులు బయటకు తీసేలోపే చనిపోయాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. బుచ్చప్పకు భార్య శివలీల, పాప ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



జెండాను ఆవిష్కరిస్తున్న గజేందర్‌గౌడ్, రైతులు

రైతులు సంఘటితం కావాలి

షాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా రైతులంతా సంఘటితం కావాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం కేశవగూడలో కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించి అవుకు పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకుపోయి, పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా కమిటీ సభ్యుడు సత్యానారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు కృష్ణయ్య, పెంటయ్య, మల్లయ్య, చెన్నయ్య, చంద్రయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, నాగులపల్లి చెన్నయ్య, కుమార్, రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువుకు చేయూత

తలకొండపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిపల్లికి చెందిన నిరుపేద విద్యార్థి ఉన్నత చదువుకు తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. మీసాల సందీప్ అనే విద్యార్థి టీఎస్ రెడ్డినగర్‌లోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. విద్యార్థి ఆర్థిక ఇబ్బందులపై స్థానికులు వెంకటేశ్ దృష్టికి తెచ్చారు.



ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న సుదర్శన్, మహేందర్‌యాదవ్ తదితరులు

కట్టమైసమ్మ ఆలయాభివృద్ధికి సహకరిస్తా

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయ అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా నాయకుడు సుదర్శన్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, మెంబర్లు ఎంపీ క్యాంప్ ఆఫీసుకు వెళ్లి కలిశారు. కట్టమైసమ్మ ఆలయ అభివృద్ధికి చేయూతనివ్వాలని ఎంపీ ఈటలను కోరారు. ఆలయ ఆవరణలో విద్యుత్ లైట్ల ఏర్పాటుకు సహకరించాలని ఎంపీకి వినతిపత్రం ఇచ్చారు. వారితో ఈటల మాట్లాడుతూ.. భక్తుల అవసరాలు తీర్చేలా ఆలయం వద్ద సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తామన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నవాల్గకు మహర్దశ



సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో నర్సింహులుగౌడ్

బషీరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని కాంగ్రెస్ బషీరాబాద్ మండలాధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్ అన్నారు. మంగళవారం నవాల్గలో రూ.15లక్షల ఉపాధి నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి రూ.300కోట్లు తెచ్చిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందన్నారు. ఈ నిధులతో తండాలు, ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లమ్మ, పీఏస్ వెంకటేష్, గ్రామస్తులు కిష్టప్ప, లక్ష్మయ్యగౌడ్, గోపాల్, భీమ్‌శంకర్, సదానంద, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తొలగించిన పొదలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పొదల తొలగింపు

కొత్తూర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ తహసీల్దార్ కార్యాలయం పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేసిన పొదలను మంగళవారం ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ముళ్లపొదలు కప్పేయడంతో షార్ట్‌సర్క్యూట్ అవుతుందనో, లేదా షాక్ కొడుతుందోనని ప్రజలు భయాందోళన చెందారు. దీనిపై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించలేదు. దీంతో ఈ సమస్యపై ఫిబ్రవరి 24న ఆంధ్రజ్యోతిలో 'రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్‌తో పొంచి ఉన్న ముప్పు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న పొదలను సిబ్బందితో తొలగింపజేశారు. త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ వేస్తామని అధికారి తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌శర్మ

ఔషధ మొక్కలకు పుట్టిల్లు భారత్

కడ్తాల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): భారతదేశం అనాదిగా ఔషధ మొక్కలకు పుట్టినిల్లు అని ప్రముఖ ఆయుర్వేదిక్ శాస్త్రవేత్త, బెంగళూరు శంకర గురుకులం ఫౌండర్ డాక్టర్ చంద్రశేఖర్‌శర్మ అన్నారు. ఔషధ మొక్కల ఉపయోగాన్ని నిత్య జీవనంలో భాగం చేసుకోవాలని సూచించారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి 'ది ఎర్త్ సెంటర్'లో మంగళవారం కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి ఒడిలో ఒకరోజు కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చంద్రశేఖర్ ఔషధ మొక్కల ప్రాధాన్యాన్ని వివరించారు. సీజీఆర్ చైర్‌పర్సన్ కె.లీలాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలకు ఆయుర్వేద ప్రాముఖ్యాన్ని చాటింది భారత్ అన్నారు. ఔషధ మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకొని ఇంట్లో పెంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్, జగదీశ్, సీజీఆర్ ప్రతినిధులు నాగేశ్, జ్ఞానేశ్వర్, రజనీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యాంకులోకి భగీరథ నీరు

» ఆనందం వ్యక్తం చేసిన బైర్కాన్‌పల్లి వాసులు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రంగారెడ్డి అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల పరిధిలోని బైర్కాన్‌పల్లిలోని ట్యాంకులోకి మిషన్ భగీరథ నీరు ఎక్కించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ ఇళ్లకు నల్లాల ద్వార నీరు వస్తుందని మురిసి పోయారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా గ్రామంలో నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులోకి గ్రావిటీ ద్వారా నీరు ఎక్కడం లేదు. దీంతో వాటర్ ట్యాంకు దిష్టిబొమ్మగా మారింది. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో మార్చి 1న 'భగీరథా... ఏమిటీ వ్యథ' అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ నాగమణి పనులు చేయించారు. మంగళవారం వాటర్ ట్యాంకును శుభ్రం చేయించి నీటిని ఎక్కించారు. అనంతరం గ్రామంలోని నల్లాలకు నీటిని వదిలారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



ఆలయం కోసం నగదు అందజేస్తున్న నాయకులు

విగ్రహ ప్రతిష్ఠకు మాజీ ఎమ్మెల్యే చేయూత

రంగారెడ్డి అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలం మోత్కుళ్లగూడలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయంలో దేవతామూర్తుల ప్రతిష్ఠకు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రూ.50వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ ఆర్థిక సహాయాన్ని మంగళవారం బీఆర్ఎస్ నాయకుల ద్వారా ఆయన మోత్కుళ్లగూడలోని దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతుగా సహకరిస్తానని ఈ సందర్భంగా అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. విరాళం ఇచ్చిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.92.49లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న నిర్వాహకులు

కీసర, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.92,49,961 వచ్చినట్లు ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ పర్యవేక్షణలో ఆలయ మహామండపంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అభిషేకాలు, కల్యాణోత్సవం, కల్యాణ కట్నాలు, రథం కట్నాలు, వీవీఐపీ దర్శనాలు, నందివాహన సేవ, ప్రసాదాల వితరణ, హుండీ ఆదాయ మొత్తాన్ని లెక్కించినట్లు నిర్వహకులు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని దేవస్థానం పేరిట కీసర ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతాలో జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ సభ్యులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ప్రధాన అర్చకుడు, భక్తులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



ఎంపీ రవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పాస్టర్ రూపస్, నాయకులు

ఆమనగల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఏసు భగవానుడు మానవత్వం, శాంతి, కరుణ మార్గాలను ప్రబోధించి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచాడని, ఆయన బోధనలు అనుసరణీయం అని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి అన్నారు. ఆకుతోటపల్లిలోని ఎంబీ సాలెం చర్చి శతాబ్ది ఉత్సవాలను మంగళవారం పాస్టర్ జీకే రూపస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ జిల్లాల పాస్టర్లు, క్రైస్తవులు తరలివచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రార్థనానంతరం ఉత్సవాలను ప్రారంభించారు. భక్తి గీతాలాపనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. క్రైస్తవుల సంక్షేమం, చర్చిల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. జీకె.కృపయ్య వందేళ్ల క్రితం ఇక్కడ చర్చ్ నిర్మించడం గొప్ప విషయం అన్నారు. 1893లో అమెరికాలోని చికాగోలో నిర్వహించిన మాదిరిగా ఆకుతోటపల్లిలో త్వరలో సర్వమత సమ్మేళనం, సన్మాన కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ చర్చి పునరుద్ధరణకు తాను రూ.3లక్షల వితరణ చేస్తానని రవి ప్రకటించారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు లాసర్, రాంచంద్రయ్య, రాజరత్నం, బుచ్చయ్య, శివాజీ, ప్రమోద్, అబ్రహం, మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు యాట నర్సింహ, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జగన్, మానయ్య, అనితవిజయ్, ఫరీద్, కృష్ణనాయక్, మెకానిక్‌బాబ, మహేశ్, పి.రాములు, షాబుద్దీన్, బుచ్చయ్య, కొండయ్య పాల్గొన్నారు.



జవహర్‌నగర్ మున్సిపల్ ఆఫీసు వద్ద బైఠాయించిన మహిళలు

ఎన్యూమరేటర్ల డబ్బులివ్వాలి

» జవహర్‌నగర్ కార్పొరేషన్ ఆఫీసు ముట్టడి

బిట్స్ పిలానీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యూమరేటర్లకు ఐదు నెలలు గడిచిపోతున్నా డబ్బులు చెల్లించలేదని మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయాన్ని మహిళా నిరుద్యోగులు ముట్టడించారు. 229 మంది లేడీ ఎన్యూమరేటర్లు ఆఫీసును ముట్టడించారు. కమిషనర్ వచ్చి హామీ ఇచ్చే ధర్నా విరమించం అన్నారు. ప్రధాన ద్వారం ముందు బైఠాయించారు. గత నవంబరులో సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యూరేటర్లకు రూ.10వేలు ఇస్తామని సర్వే చేయించుకున్నారన్నారు. స్థానిక మహిళా నిరుద్యోగులు నెలరోజులు సర్వే చేసి నివేదికలను అధికారులకు అందించారు. అయితే వారికి ఇప్పటికీ డబ్బులు ఇవ్వలేదు. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా డబ్బులు ఇవ్వడం లేదని ఎన్యూమరేటర్లు ఆందోళనకు దిగారు. దీంతో కమిషనర్ వసంత వచ్చి వారితో మాట్లాడారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు సమగ్ర కుటుంబ సర్వే నిధులు రూ.25లక్షలు రావాల్సి ఉందని, ఎన్యూమరేటర్లకు చెల్లించే డబ్బు విషయంపై అధికారులతో మాట్లాడి డబ్బులందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు భాస్కర్, విక్రమ్, శంకర్ తదితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా భద్రతా విభాగ ఎస్పీ అశోక్‌కుమార్

చదువుతోనే గుర్తింపు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మహిళా భద్రతా విభాగ ఎస్పీ జె.అశోక్‌కుమార్ అన్నారు. ఘట్‌కేసర్ పరిధి అవుశాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 'మై చాయిస్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సేఫ్ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలపై లైంగిక దాడులు, అక్రమ రవాణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బాలికలు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. మహిళలు, బాలికలు అధైర్యపడొద్దని, ఆపద సమయంలో 100 నంబర్‌కు కాల్ చేయాలని, నిమిషాల్లోనే పోలీసులు చేరుకుంటారని తెలిపారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, అక్రమ రవాణాలపై నిఘా పెంచామన్నారు. బాగా చదివి తల్లిదండ్రులకు పేరు తెచ్చి ఉన్నత సమాజస్థాపనకు కృషిచేయాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. మై చాయిస్ ఫౌండేషన్ పదివేల గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు పూర్తిచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు ఎల్క, గ్రోఫ్లర్, డేనియల్, హెచ్ఎం శైలజ, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాలతో సమాజ శాంతి

ఆమనగల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి నెలకొనేందుకు, మానవాళి పురోగమనానికి దైవ కార్యక్రమాలు దోహదం చేస్తాయని టాస్క్ సీవీవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లులోని శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు, అభిషేకంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, నిర్వాహకులు రాఘవేందర్‌రెడ్డిని సత్కరించారు. ఆలయాభివృద్ధికి సహకరించిన సుంకిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి పాటుపడుతున్నట్లు చెప్పారు. ఆలయాల జీర్ణోద్ధరణ, దైవకార్యక్రమాలకు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనే ఫౌండేషన్ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, నాయకులు బాలకృష్ణ గౌడ్, డి.యాదయ్య, నిరంజన్, వెంకటయ్య, సతీష్‌గౌడ్, నర్సింహా గౌడ్, కుమార్, వెంకటయ్య, బాలకృష్ణ, నిరంజన్, సురేశ్, నారాయణ, శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న అల్లాజీగౌడ్, రవీందర్, గౌడ సంఘం నాయకులు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

» తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరిక

» గొల్లపల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

రంగారెడ్డి అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరించారు. ప్రభుత్వ భూముల క్రయవిక్రయాలు చేయడం నేరమని తెలిపారు. గతంలో ప్రభుత్వం మున్సిపల్ పరిధిలోని సర్వే నెం 219, 220 221లో కొందరు నిరుపేదలకు భూములు ఇచ్చారు. అయితే కొందరు అక్రమార్కులు ఆ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి ఇళ్ల నిర్మాణం చేశారు. వాటికి ఇంటి నంబర్లు కూడా తీసుకున్నారు. ఆ నిర్మాణాలను తహసీల్దార్ సమక్షంలో మంగళవారం కూల్చివేశారు. అక్రమంగా ఇంటి నెంబర్లు ఇస్తున్నారనే ఆరోపణలపై మున్సిపల్ కమిషనర్‌ను తహసీల్దార్ వివరణ కోరారు. గొల్లపల్లిలో కొన్ని ఇళ్ల నంబర్లను రద్దు చేసినట్లు వివరించారు. రద్దు చేసిన ఇంటి నంబర్ల జాబితా ఇవ్వాలని కోరగా త్వరలోనే పూర్తి వివరాలు ఇస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న రిటైర్డ్ జడ్జి సాంబశివరావు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ సేవలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో మంగళవారం లోక్‌అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 71మంది కేసులను పరిష్కరించి రూ.1,86,500, అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేని 63 మందికి రూ.83,500 జరిమానా విధించామని తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్సై చందర్‌నాయక్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

8 వరకు తాండూరు మున్సిఫ్ కోర్టులో లోక్ అదాలత్ : ఎస్సై



తాండూరు రూరల్: ఈ నెల 8వ తేదీ వరకు తాండూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి కోరారు. పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. 75కేసుల వరకు ఉన్నాయని, 25కేసుల వరకు లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు.

ఘట్‌కేసర్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం



ఘట్‌కేసర్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న హరికృష్ణ, ప్రసాద్

ఘట్‌కేసర్, మార్చి4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మంగళవారం మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో నూతన శాఖను ప్రారంభించింది. ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధి శివారెడ్డిగూడలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను బ్యాంక్ డిప్యుటీ జోనల్ మేనేజర్ కె.హరికృష్ణ సమక్షంలో హైదరాబాద్ జోనల్ మేనేజర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా వచ్చి ప్రారంభించారు. ఈ బ్రాంచ్‌తో తెలంగాణ జిల్లాల్లో తమ బ్రాంచ్‌ల సంఖ్య 73కు చేరిందని అధికారులు తెలిపారు. ఘట్కేసర్ బ్రాంచ్ అన్ని సాధారణ బ్యాంకింగ్ లావాదేవీలు, ఖాతాదారులకు అవసరమైన నిర్దిష్ట సేవలందిస్తుందని చెప్పారు. ఖాతాదారులకు ఏటీఎం కమ్ డెబిట్ కార్డ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, 24/7 కస్టమర్ కేర్ సర్వీసెస్, మొబైల్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలను అందిస్తున్నామని తెలిపారు. జోనల్ మేనేజర్ మాట్లాడుతూ.. ఘట్కేసర్ బీఓఎం శాఖ ప్రజల అన్ని బ్యాంకింగ్, ఆర్థిక అవసరాలు తీర్చేందుకు పాటుపడుతుందన్నారు. కొత్త శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. డిప్యుటీ జోనల్ మేనేజర్ మాట్లాడుతూ.. రీటైల్ కస్టమర్లకు, చిరు లెవెల్ వ్యాపారులకు బ్యాంకింగ్ సేవలను మరింత సమర్థంగా అందిస్తామన్నారు. బ్యాంకింగ్ అవసరాలకు ఇది ఒక స్టాప్‌షాప్‌గా ఉంటుందని చెప్పారు. తమ బ్యాంక్ దేశంలో 2,400పైగా శాఖలతో 3కోట్ల మంది ఖాతాదారులకు సేవలందిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ బ్రాంచ్ మేనేజర్ బాలినా యాకుబ్‌రావ్ అతిథులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యజమాని వస్తేనే బస్సును వదుల్తాం

» బాలుడి మృతికి పరిహారమివ్వాలని డిమాండ్



ఆందోళనకు దిగిన వారితో మట్లాడుతున్న ఎస్ఐ శంకర్

బషీరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బాలుడి మృతికి కారణమైన ఆర్టీసీ అద్దె బస్సును యజమాని వచ్చేదాకా వదలం అని మృతుడి కుటుంబీకులు, తండావాసులు అడ్డుకున్న ఘటన బషీరాబాద్ టాకీ తండా వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగింది. గత నెల 19న ఆర్టీసీ అద్దె బస్సుకింద పడి రథోడ్ వెంకటేష్ కుమారుడు శ్రీరామ్(7) మృతి చెందాడు. ఆందోళన చేసిన బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని డిపో మేనేజర్ హామీ ఇవ్వడంతో బాలుడి మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే ఇంత వరకూ తమను ఎవరూ పట్టించుకోవడంలేదని ఆగ్రహించిన బాలుడి కుటుంబీకులు, గ్రామస్థులు మైల్వార్‌కు వెళ్తున్న అద్దె బస్సును అడ్డుకున్నారు. బస్సు యజమాని వచ్చి మాట్లాడితేనే బస్సును కదలనిస్తామని భీష్మించారు. దీంతో బషీరాబాద్ ఎస్ఐ శంకర్, సిబ్బందితో అక్కడికి చేరుకొని ఆరా తీశారు. ఆర్టీసీ డీఎంకు సమాచారం ఇవ్వడంతో ఆయన తండా వాసులతో మట్లాడారు. బుధవారం ఇంటర్ పరీక్షలున్నాయని, సర్వీసు అవసరం అని, న్యాయం కోసం బస్సు యజమానితో మట్లాడిస్తానని ఒప్పించడంతో బస్సును వదిలేశారు.

బంట్వారం పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

బంట్వారం మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బంట్వారం గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీవో రాములుకు బీజేపీ మండల అధ్యక్షుడు మహేష్ వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా సరిగా కావడంలేదని, ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

వికారాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యూ గంజ్‌లో గల శ్రీఅన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర ఆలయ సహస్ర కలశాభిషేకం పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఆవాహిత దేవత పూజ, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి అన్నదానం నిర్వహించారు.

ఎల్ఆర్ఎస్‌పై విస్తృత ప్రచారం

తాండూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వ ఫోకస్ పెట్టింది. ఆదాయ వనరులు పెంచుకునేందుకు ఇదీ ఒక మార్గం కావడంతో విస్తృత ప్రచారం కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో మునిసిపల్ అధికార యంత్రాంగం ఎల్ఆర్ఎస్‌పై కల్పించిన రాయితీని ప్రజలకు వివరించేందుకు బ్యానర్లు, మైకులు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. మంగళవారం తాండూరు మునిసిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. సమస్యలను నివృత్తి చేసుకునేందుకు ఈహెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అనుమతులు లేని ప్లాట్లు, లేఅవుట్లు క్రమబద్ధీకరించేందుకు ఇదో మంచి అవకాశం. ముఖ్యంగా రియల్ఎస్టేట్ వ్యాపారులకు బంపర్ ఆఫర్‌గా చెప్పవచ్చు. 2020లో దరఖాస్తులు చేసుకున్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు యంత్రాంగం దృష్టిపెట్టింది. ఇందులో బాగంగానే ఈనెల 31లోపు ఫీజు చెల్లించిన వారికి ప్రభుత్వం 25శాతం రాయితీ కల్పిస్తోంది. వీలైనంత త్వరగా దరఖాస్తులు పరిశీలించేందుకు యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. రియల్ఎస్టేట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన వెంచర్లలో 10శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్ అయి ఉంటే మిగిలిన 90శాతం ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం ఉంది.



తాండూరులో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్

క్రైం కార్నర్

తోర్మామిడిలో విషాదఛాయలు



కూతురు మరణంతో రోదిస్తున్న కన్నతల్లి రామలక్ష్మి



భర్త శరత్‌చంద్రతో దేవిక (ఫైల్)

బంట్వారం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కూతురు 5 సంవత్సరాలు ఉన్న సమయంలోనే కన్నతండ్రి మరణించడంతో ఉన్న ఒక్కగానొక్క కూతురును అల్లారు ముద్దుగా పెంచింది ఆ కన్నతల్లి. చిన్నప్పటి నుంచి కూతురును కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉన్నత చదువులు చదివించింది. తన ఇష్టాన్ని కాదనకుండా ప్రేమించిన వ్యక్తితోనే పెళ్లి చేసింది. ఈ క్రమంలో పైళ్లైన ఎనిమిది నెలలకే వరకట్న వేధింపుల కారణంగా కూతురు విగతజీవిగా మారడంతో ఆతల్లి రోధనలు మిన్నంటాయి. దీంతో ఆగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం తోర్మామిడి గ్రామానికి చెందిన రాంచందర్, రామలక్ష్మీ దంపతుల 26ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. అయితే వారికి కూతురు దేవిక (25) జన్మించింది. దేవిక 5 సంవత్సరాల వయస్సు ఉన్న సమయంలోనే తండ్రి మరణించగా రామలక్ష్మి వ్యవసాయం పనులు చూసుకుంటూ కూతురును కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉన్నత చదువులు చదివించింది. 10వ తరగతి వరకు సదాశివపేట కేఎల్‌పాల్ స్కూల్‌లో చదివిన దేవిక ఇంటర్మీడియట్ హైదరాబాద్ శ్రీ చైతన్య కళాశాలలో చదువుకుంది. డెహ్రాడూన్‌లోని మాయ కాలేజీలో బీఎస్సీ అగ్రికల్చర్ చేసి పూణె యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసి హైదరాబాద్‌లో గ్లోబల్ డేటా కంపెనీలో గత రెండు సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తోంది. అక్కడే వరంగల్‌కు చెందిన శరత్‌చంద్ర పరిచయం కాగా అది ప్రేమగా మారింది. విషయాన్ని దేవిక కన్నతల్లికి చెప్పి ఒప్పించి పెద్ద అంగీకారంతో గత సంవత్సరం ఆగస్టులో గోవాలో కులాంతర వివాహం చేసుకున్నారు. పెళ్లి అయిన మూడు నెలల నుంచి భర్త, అత్తింటి వారు వరకట్నం కోసం వేధించగా కుమిలిపోయిన దేవిక హైదరాబాద్‌లో సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలిసిన దేవిక తల్లి రామలక్ష్మి రోధనలు మిన్నంటాయి. అయితే తన కూతురును అత్తింటి వారు హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని దేవిక తల్లి రామలక్ష్మి పేర్కొంటూ రోధిస్తుంది. దేవిక అంత్యక్రియలను తొర్మామిడి తరలించి అంత్యక్రియలు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అంత్యక్రియలకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

- రూ.2లక్షల నగదు, 3తులాల బంగారు ఆభరణాల అపహరణ

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బంధువు మృతిచెందగా అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వచ్చేసరికి దొంగలు పడి నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ, యంనంపేట్, తిరుమల ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న గుజారి అంబరేష్ కామారెడ్డిలో పశువైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. అంబరేష్ తన భార్యతో కలిసి సోమవారం కామారెడ్డిలోని తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లగా, అతడి కుమారుడు, కూతురు కాలేజీకి వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. అందులోని రూ.2లక్షల నగదు, 3 తులాల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించారు. క్లూస్ రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విజయోస్తు..!

(5వ పేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో హాజరయ్యేందుకు వీలుగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

విస్తృతంగా తనిఖీలు

ఇంటర్ పరీక్షల నిర్వహణ పకడ్బందీగా కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. గది విస్తీర్ణం ఆధారంగా 20 నుంచి 40 మంది వరకు విద్యార్థులు కూర్చునే విధంగా కేటాయించినా ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున నియమించారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని కేటాయించారు. పరీక్షల్లో కాపీయింగ్‌కు అవకాశం కల్పించకుండా ఒక రెండు సిట్టింగ్ స్క్వాడ్, డెక్ తనిఖీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టనున్నాయి. పోలీసు స్టేషన్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాలు తీసుకొచ్చి సీల్ తీయడం నుంచి విద్యార్థులు రాసిన ఆన్సర్ షీట్లను సీల్ వేయడం వరకు అంతా సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణలోనే కొనసాగనుంది. చీఫ్ సూపరింటెండెంట్ మినహా మిగతా వారెవరికీ మొబైల్ ఫోన్లను అనుమతించరు. సంబంధిత అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డులు ధరించిన వారినే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

మేడ్చల్ జిల్లాలో 150 పరీక్షా కేంద్రాలు

ఇంటర్ పరీక్షలకు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 150 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు 1,26,423 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో జనరల్ 1,24,115 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,308 మంది ఉన్నారు. ప్రతీ సెంటర్‌కు ఓ కోడ్‌ను ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రానికి ఒక చీఫ్ సూపరిండెంట్ చొప్పునం 150 మంది, 150 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 6 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 5 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలకు వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను కూడా ఏర్పాటు చేశారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

దోమ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీ (బుధవారం) నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండటంతో దోమ ప్రభుత్వ జనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీవో వరస్వామి, చీఫ్ సూపరింటెండెంట్ రాములు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 168 మంది, ద్వితీయ సంవత్సరం 135మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులు ఉదయం 9గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు.

కులకచర్ల: స్థానిక వివేకానంద, శ్రీ రామలింగేశ్వర కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్నాయి. మొదటి రోజు వివేకానంద కళాశాలలో 250 మంది, శ్రీ రామలింగేశ్వర కళాశాలలో 222 మంది పరీక్షలు రాయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఈవో గోపాల్

టెన్త్ పరీక్షలకు సిద్ధం చేయాలి

పరిగి: టెన్త్‌క్లాసు పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంఈవో గోపాల్ సూచించారు. నస్కల్‌లోని కస్తూర్బా పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. బాలికలకు మంచి ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ అధికారి సఫియాసుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యాశాఖ మంత్రి లేని రాష్ట్రం తెలంగాణ'

వికారాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి లేని రాష్ట్రంగా తెలంగాణ కొనసాగుతున్నదని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, నవాబుపేట కస్తూర్బా గాంధీ పాఠశాలలో జరిగిన సంఘటనలు రాష్ట్రంలో సర్వసాధారణంగా మారాయన్నారు. ఒక వసతి గృహంలో విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం అంటే అక్కడ ఉన్న పరిస్థితి మనం అర్థం చేసుకోవచ్చన్నారు. ఇలాంటి ఘటనలు మిగతా విద్యార్థుల మీద తీవ్రప్రభావం చూపిస్తాయన్నారు. కొన్ని ప్రదేశాల్లోని వసతిగృహాల్లో పాములు, తేళ్లు, ఎలుకల కాటుకు గురవుతూనే ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి విద్యార్థుల మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

శరవేగంగా ఎంఎంటీఎస్ కోసం భూసర్వే

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైల్వేలైన్ కోసం భూసర్వే పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కీసర ఆర్డీవో ఆదేశాల మేరకు మంగళవారం అవుశాపూర్‌లో ఎంఎంటీఎస్ రైల్వేలైన్ కోసం భూసర్వే నిర్వహించారు. ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు ఏర్పాటు చేయబోయే ఎంఎంటీఎస్ రైల్వే లైన్ కోసం ఘట్‌కేసర్ మండలంలో ఘట్‌కేసర్, అంకుశాపూర్, అవుషాపూర్‌ల్లో అధికారులు భూసర్వే పూర్తి చేసి హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేడీఐ సత్తమ్మ, సర్వేయర్లు వినయ్, సునీత, భవాని, ఆర్ఐలు కావ్యారెడ్డి, సాయిరాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా రోడ్డు వేస్తున్న నిర్వాహకులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వికారాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో అక్రమంగా రోడ్డు వేస్తున్న నిర్వాహకులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేశారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'అంతా మా ఇష్టం' కథనానికి స్పందించిన అధికారులు సోమవారం పనులు ఆపివేయగా నిర్వాహకులకు అందుకు సంబంధించిన నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రభుత్వ భూమిలో 40ఫీట్ల రోడ్డు వేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ను కలిసిన సురేశ్‌రాజ్

దుద్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్‌ను దుద్యాల మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సురేశ్‌రాజ్ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండ ప్రకాశ్ లగచర్ల ఘటనలో నిందితులందరికీ బెయిల్ మంజూరు చేయడంలో పార్టీ క్రియాశీలకంగా పని చేసిందన్నారు. మీ అందరికీ ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని, పార్టీ పరంగా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చినట్లు సురేశ్‌రాజ్ తెలిపారు.

విద్యార్థులకు చెక్కుల పంపిణీ

కోట్‌పల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల కిందట ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా మంగళవారం మండలంలోని కేజీబీవీ కోట్‌పల్లి, ఎన్నారం, రాంపూర్, జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా రూ.2,500 చెక్కు ఇచ్చినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కందుకూరి శివకుమార్ తెలిపారు.

ఆర్థిక సాయం

వికారాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపూర్ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ అనారోగ్యంతో మృతిచెందడంతో వారికి డీఆర్డీవో శ్రీనివాస్ కార్యాలయం తరఫున రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో వినోద్‌కుమార్ రూ.30వేలు అందజేశారు.

భయం గుప్పిట్లో మేడ్చల్!

(5వ పేజీ తరువాయి)

లా అండ్ ఆర్డర్‌ను పటిష్టం చేయడానికి మేడ్చల్‌ను ప్రత్యేక జోన్‌గా ఏర్పాటు చేసి ఇద్దరు ఏసీపీలను కేటాయించారు.

60 శాతం స్థానికేతరులు

ప్రధానంగా ఈ ప్రాంతంలో పెరుగుతున్న స్థానికేతరులు ప్రాబల్యమే నేరాల పెరుగుదలకు కారణమని పలువురు భావిస్తున్నారు. మేడ్చల్ పట్టణంలో స్థానికులు 40 శాతం ఉంటే స్థానికేతరులు 60 శాతం వరకు ఉన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో దాదాపు 17 గ్రామాలు, రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. దీనికి తోడు పారిశ్రామికవాడలు, వేర్‌హౌజ్‌లు, ఇతర వ్యాపార సంస్థలు అనేకం ఉన్నాయి. దీంతో ఇక్కడ ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి చాలామంది ఇక్కడ వచ్చి స్థిరపడ్డారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడ కొందరు హత్యలు, దొంగతనాలు, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతియుత వాతావరణాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నారు.

కొరవడిన నిఘా

స్థానికంగా పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు ఎప్పటికప్పుడు తిరుగుతూ శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేస్తున్నా.. నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి దాటే వరకు హోటళ్లు, పాన్ షాపులు, ధాబాలు, టీ స్టాళ్లు, ఫుడ్ కోర్టులు, మండీ బిరియాని రెస్టారెంట్‌లు తెరిచే ఉంటున్నాయి. దీంతో రాత్రి వేళ జులాయిగా తిరిగే వారికి అడ్డూఅదుపు లేకుండా పోయింది. కేవలం మద్యం దుకాణాలు తప్ప అన్ని దుకాణాలు అర్ధరాత్రి వరకు తెరిచే ఉంటున్నాయి.

రూరల్ పీఎస్ ఏర్పాటుకు ప్రతిపాదన

దాదాపు లక్షకు పై జనాభా ఉన్న మేడ్చల్ పీఎస్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా రూరల్ పీఎస్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఇటీవల అధికారులు ప్రభుత్వానికి పంపారు. గతంలో డబీల్‌పూర్, గుండ్లపోచంపల్లిలో ప్రత్యేకంగా పీఎస్‌లు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతి పాదించినప్పటికీ ప్రభుత్వం అందుకు ఆమోదం తెలపలేదు. కాగా ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న క్రైమ్ రేట్‌ను నియంత్రించడానికి స్థానికంగా పలు గ్రామాలను కలుపుతూ కొత్తగా రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. రూరల్ పీఎస్ ఏర్పాటుతో కొద్ది మేర క్రైమ్ రేట్‌ను నియంత్రించే అవకాశం లేకపోలేదు.

ఎమ్మెల్సీ గెలుపుతో బీజేపీ సంబురాలు



తాండూరు రూరల్: తాండూరులో ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ

తాండూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ తపస్ బలపరిచిన బీజేపీ అభ్యర్థి మల్కా కొమరయ్య ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన సందర్భంగా తపస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కోశాధికారి కరణం లక్ష్మీకాంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆనందం, డి.రాములు, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం, సంఘం నాయకులు తదితరులున్నారు.

ఘట్‌కేసర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్కా కొమురయ్య విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఘట్‌కేసర్‌లో మంగళవారం బీజేపీ కార్యకర్తలు బాణాసంచాలు కాల్చి స్వీట్లు పంచుకొని సంబురాలు జరిపారు. ఈ కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, మధు, దామోదర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రకాష్ రెడ్డి, మధుసుదన్‌రెడ్డి, మాధవి, కోటేశ్వర్, మమత తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ సంబురాలు

యాలాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితాలతో పీఆర్టీయూటీఎస్ యాలాల మండల శాఖ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో పీఆర్టీయూ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించిన సందర్భంగా మంగళవారం పీఆర్టీయూటీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు డి.వెంకట్ రాంరెడ్డి ఆధ్వర్యంలో యాలాల మండలంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వద్ద బాణసంచాలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సి.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొగులయ్య, పటేల్ మహేష్‌కుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మధుసూదనరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పరిగి: ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించిన సందర్భంగా పరిగిలో ఉపాధ్యాయ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. బాణసంచాను పేల్చి స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎండీ ఉస్మాన్‌అలీ, రామాంజనేయులు, రాకేష్, గోపాల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



పరిగి: సంబురాలు జరుపుకుంటున్న ఉపాధ్యాయులు

కేజీబీవీ పాఠశాల సందర్శన

నవాబుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్ భరత్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎలుకల కాటుకు గురైన విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపించాలని ఎంఈవో, పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా డీఈవో రేణుకాదేవి పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ, ఎంఈవో అబ్దుల్ రహెమాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, సామ వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఇక్బాల్, సంజీవ్‌రెడ్డి, కరణం రఘు, గణపూరం ప్రసాద్, బందెయ్యగౌడ్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

పరిగి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో ఎంఎ కరీం అన్నారు. మండలంలోని రంగంపల్లి, రూప్‌ఖాన్‌పేట్, సోండేపూర్ తదితర గ్రామాలను మంగళవారం సందర్శించారు. నర్సరీలు, షెడ్‌ఏర్పాటు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నర్సరీల్లో షిఫ్టింగ్, గ్రేడింగ్ పనులపై ఆరా తీశారు. రూప్‌ఖాన్‌పేట్,రంగంపల్లి పాఠశాలలను సందర్శించి మధ్యాహ్నభోజనం గురించి ఆరా తీశారు.

సంక్షిప్తంగా..

అక్రమ మైనింగ్‌పై చర్యలు తప్పవు

నవాబుపేట: అక్రమ మైనింగ్ జరిపితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ జయరాం అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అక్రమ మైనింగ్ నిర్వహించిన ఏడుగురిని బైండోవర్ చేసి హెచ్చరించారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మేడ్చల్ ప్రతినిధి: శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద నిర్వాహకులు మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఆలయం తరఫున గౌడసంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత

దుద్యాల: మండల కేంద్రానికి చెందిన కుమ్మరి శారద దేవికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కును డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్, మెరుగు వెంకటయ్య, ఖాజమీయ, శ్రీశైలం గౌడ్, ఖలీల్ పాష, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజలు మూఢ నమ్మకాలు వీడాలి

కోట్‌పల్లి/ధారూరు: ప్రజలు మూఢ నమ్మకాలు వీడాలని కోట్‌పల్లి ఎస్ఐ గఫర్ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మూఢనమ్మకాలపై కళాజాత బృందం నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా ధారూరులో సోమవారం రాత్రి అవగాహన కల్పించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మర్పల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు యాదవ్, మండల అధ్యక్షుడు సురేశ్ అన్నారు. మండలంలోని పట్లూర్‌లో మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

ఘనంగా బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

మూడుచింతలపల్లి: మండలంలోని పోతారం గ్రామంలో బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీకేఎస్ మూడుచింతలపల్లి మండలాధ్యక్షుడు హరిమోహన్‌రెడ్డి బలరాముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి జెండాను ఆవిష్కరించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

దుద్యాల: మండలంలోని నేతాజీ విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 13మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అదే విధంగా దుద్యాల జడ్పీహెచ్ఎస్‌లో 45మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు.

భరత్‌భూషన్‌కు ఘన నివాళి

తాండూరు: తాండూరు పట్టణ సీనియర్ నాయకులు, పోట్లీమహారాజ్ దేవస్థానం మాజీ చైర్మన్ భరత్ భూషన్ మంగళవారం హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేజీబీవీ పనులు త్వరలో పూర్తి చేయిస్తాం

కోట్‌పల్లి: మండలంలోని కరీంపురం గేటు సమీపంలో నిర్మిస్తున్న కేజీబీవీ పాఠశాల పనులు అతిత్వరలో పూర్తి చేయిస్తామని మండల విద్యాధికారి చంద్రప్ప అన్నారు. నూతన కేజీబీవీ పాఠశాల పనులను మంగళవారం ఆయన పర్యవేక్షించారు.

జర్నలిస్టుల ప్లాట్లు సర్వే చేయించండి



వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

తాండూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతారం గ్రామ సమీపంలోని జర్నలిస్టుల కోసం ప్రైవేటుగా కొనుగోలు చేసిన స్థలాన్ని వెంటనే సర్వేచేసి సమస్య పరిష్కరించాలని జర్నలిస్టులు కోరారు. తాండూరు నియోజకవర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్టులు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి, రాష్ట్ర ప్రతినిధి వేణుగోపాల్‌రెడ్డి, ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ తారాసింగ్‌తో కలిసి సర్వే నిర్వహించాలని కోరారు. అంతారం గ్రామ శివారులోని సర్వేనంబర్-116, 117లో కొన్ని సంవత్సరాల కిందట ప్రైవేటు స్థలాన్ని జర్నలిస్టుల ఇళ్ల ప్లాట్ల కోసం అప్పట్లో కొనుగోలు చేశామని తెలిపారు. అయితే అందులో కొంత భూమిని సమీపంలోని ఇతర యజమానుల వద్ద రికార్డుకు చూపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, లింగేష్, యాస వెంకట్‌రాంరెడ్డి, సంగమేశ్వర్, శాంతు, శివానంద్ తదితరులున్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

ఘట్‌కేసర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మున్సిపాలిటీ పరిధిలోని 9, 10 వార్డుల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా 9వ వార్డులోని మేడపాటి నగర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకు ఉన్నప్పటికీ పైపులైన్ లేనందున వెంటనే పైప్‌లైన్ సౌకర్యం కల్పించాలని కోరారు. 10వ వార్డులోని మేడో కాలనీ, సోలో కాలనీల్లో మిషన్‌భగీరథ నీటిసరఫరా కాకపోవడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీలోని పార్కు స్థలంలో బోరు వేసి తమ ఇబ్బందులు తీర్చాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి, ఆంజనేయులు, శశిధరన్, సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే బీకేఎస్ ధ్యేయం

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ధ్యేయమని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేటలో బీకేఎస్ ఆవిర్భావదినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు భగవాన్ బలరాం చిత్రపటానికి పూలమాలలు వేసి బీకేఎస్ పతాకావిష్కరణ చేశారు. శామీర్‌పేటలో త్వరలో బీకేఎస్ కమిటీ వేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, సురేందర్‌రెడ్డి, ఐలయ్యయాదవ్, భూమిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నరసింహారెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ట్రస్ట్‌బోర్డుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలి

తాండూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సద్గురు పోట్లీ మహారాజ్ దేవస్థానం, నగరేశ్వర్‌స్వామి ఆలయాలకు ట్రస్టుబోర్డు సభ్యులుగా నియామకం కోసం ఆసక్తి కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలని ఈవో టి.నరేందర్ తెలిపారు. ఈ రెండు ఆలయాలకు పాలకమండలి నియామకం కోసం కమిషనర్, దేవాదాయ శాఖ హైదరాబాద్ వారు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. నోటిఫికేషన్ జారీచేసిన రోజునుంచి 20రోజుల్లోపు సహాయ కమిషనర్, రంగారెడ్డి జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.